
సాక్షి పల్నాడు

శుక్రవారం । 15 । మార్చి । 2024



ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

ఈపూరు : బొగ్గరంలో ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామిని దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మకు వెండి గంగాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు నగరానికి చెందిన భక్తులు 12.5 కిలోల వెండి గంగాళాలు, మూతలను గురువారం అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
చిలకలూరిపేట	6.26	5.00
గుంటూరు	6.23	4.59
బాపట్ల	6.23	4.59

న్యూస్‌రీల్

ప్రావిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రావిజనల్ మెరిట్ లిస్టును గురువారం విడుదల చేశారు. ప్రావిజనల్ మెరిట్ లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ధ్రువపత్రాలతో అందజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి తెలిపారు. ప్రావిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు వైద్య కళాశాల నోటీసు బోర్డులో, గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

దేశమ్మ తల్లి ఆలయానికి భూమిపూజ



పెదకూరపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్ట్ వారి రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో మండలంలోని 75 త్యాళ్ళూరులో గ్రామ దేవత దేశమ్మ తల్లి ఆలయానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చిర్రా శ్రీనివాసరెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, ములకా వెంకటరెడ్డి, చిర్రా రాఘవరెడ్డి, అల్లం మాధవరెడ్డి, ఈదా సాంబిరెడ్డి, కొల్లి లింగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మికత భావం పెంపొందించేందుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో శ్రీవాణి ట్రస్ అందించిన ఆర్థిక సహాయంతో దేవాలయం నిర్మాణం త్వరితగతి పూర్తి చేస్తామని తెలిపారు.

నేడు ఐఎంఏలో సీఎంఈ

గుంటూరు మెడికల్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో గుంటూరులోని ఐఎంఏ హాలులో శుక్రవారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సీఎంఈ) నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. హైపో థైరాయిడిజం – వంధ్యత్వం అనే అంశంపై ఎండ్రోకెనాలజిస్ట్ డాక్టర్ లావణ్య కటకం, వంధ్యత్వం చికిత్సలో ఆధునిక పద్ధతులు అంశంపై డాక్టర్ స్వప్న శ్రీకాంత్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. వైద్యులందరూ ఈ కార్యక్రమానికి హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

18 నుంచి ఒంటి పూట బడులు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒక్కపూట తరగతులు నిర్వహించాలని డీఈవో పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మధ్యాహ్నం 12.30 తరువాత అందించాలని హెచ్ఎంలను ఆదేశించారు. ఒకటి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలను గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలని, చెట్ల కింద, ఖాళీ ప్రదేశాల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. టెన్త్ పరీక్షలు జరిగే కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని, ఆయా పాఠశాలల్లోని ఒకటి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23 మధ్య కాలంలో అందుబాటులో ఉన్న సెలవు దినాల్లో విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు తరగతులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.8200, మోడల్ ధర రూ.7300 వరకు పలికింది.

నాడు పేదల బడి నేడు చదువుల గుడి

- ప్రభుత్వం, దాత సహకారంతో అభివృద్ధి పథంలో 75త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల
- అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో ప్రయోగాలు
- ఆకట్టుకుంటున్న ఆర్గానిక్ కిచెన్ గార్డెన్
- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ
- బాలికా విద్యకు ప్రోత్సాహం
- ప్రతినెలా కాంప్లెక్స్ సమావేశాలు
- పీఎంశ్రీ పథకానికి ఎంపిక



పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

నాడు ప్రభుత్వ పాఠశాల అనే చిన్న చూపు.. నేడు మన బడి అన్ని గర్వంగా చెప్పుకునే చదువుల గుడిగా పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో ప్రత్యేకతను సొంతం చేసుకుంది. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సాహం, దాతల సహకారంతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. నేడు నిత్యం మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఆహ్లాదకరమైన వాతావరణం, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఎన్‌సీసీ, జిల్లాస్థాయిలో క్రీడల్లో ప్రతిభ, ఆర్గానిక్ కిచెన్ గార్డెన్, అధునాతనమైన మరుగుదొడ్లు, రుచికరమైన జగనన్న గోరుముద్ద, పీఎంశ్రీకి ఎంపిక, బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ జూనియర్ బాలిక కళాశాల.. ఇలా చెప్పుకుంటుపోతే అనేక సదుపాయాలు ఈ పాఠశాల సొంతం.



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పెదకూరపాడు: 2016–17 సంవత్సరానికి ముందు 75త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అస్తవ్యస్తంగా ఉండేది. రాత్రయితే చాలు మందుబాబులకు అడ్డాగా నిలిచేది. గ్రామ శివార్లలో ఉండటంతో రక్షణ లేకుండా పోయింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గుత్తికొండ తిరుపతిరెడ్డి కుమారుడు ఎన్ఆర్ఐ గురవారెడ్డి చొరవతో వారి కుటుంబ సభ్యులు నందిగల వెంకటరెడ్డి అందించిన రూ.20 లక్షలతో పాఠశాలకు మరమ్మతులు, రంగులు, బాలికలకు మరుగుదొడ్లు నిర్మించి అభివృద్ధికి బాటలు వేశారు.



అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రయోగాలు

జగనన్న ప్రభుత్వంలో రూ.1.92 కోట్లతో అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మొదటి విడత నాడు–నేడు కింద రూ.60లక్షలతో విద్యార్థులకు బల్లలు, ఫర్నిచర్, పాఠశాల మరమ్మతులు, బాలిక మరుగుదొడ్లు, త్రీఫేజ్ విద్యుత్ లైన్లు సౌకర్యాలు కల్పించారు. రెండో విడత నాడు–నేడు కింద ప్రభుత్వం రూ.96 లక్షలు కేటాయించింది. వీటితో 10 అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. విద్యార్థి నిష్పత్తి ప్రకారం పీఎంశ్రీ పథకం కింద పాఠశాల ఎంపికైంది. దీంతో మరిన్ని నిధులతో పాఠశాల అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఇవేకాక జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.30 లక్షలతో ప్రహరి నిర్మించారు.

రాష్ట్రస్థాయి సదస్సుకు ఎంపిక

పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ రాష్ట్ర స్థాయి సదస్సుకు ఎంపికైంది.ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు ప్రయోగాత్మక, పరిశోధనాత్మకంగా ఎదుగుతున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాల విద్యార్థులు ల్యాబ్ ద్వారా ఎల్ఈడీ బల్బుల్ని తయారు చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ ల్యాబ్‌ను సందర్శించి విద్యార్థులు చేస్తున్న ప్రయోగాల్ని తిలకించి అభినందించారు.

ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు బోధన

విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఏ,బీ, సీ, డీగా విభజించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. వీటితో పాటు ఎన్‌సీసీలో విద్యార్థుల్ని భాగస్వాములు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో క్రీడలతో ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారు.

జూనియర్ కళాశాల మంజూరు

జగనన్న ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ఈ పాఠశాలకు బాలిక జూనియర్ కళాశాలను మంజూరు చేసింది.ఈ ఏడాది 16 మంది విద్యార్థులు ఎంపీసీ, సీఈసీలో చేరారు. వారికి బోధించేందుకు ఎనిమిది మంది లెక్చలర్లను నియమించారు. ఒకేషన్ కోర్సులో భాగంగా ఒక ఉపాధ్యాయుడిని ఇచ్చారు. మొత్తం 10 మందికి పైగా చెవిటి, మూగ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించేందుకు ఒక ఉపాధ్యాయుడిని ప్రభుత్వం కేటాయించింది.

ఆర్గానిక్ కిచెన్ గార్డెన్‌లో పండే కూరగాయలతో రుచికర ఆహారం

విద్యార్థులకు కల్తీలేని, రసాయనాలు వాడని ఆహారం అందించాలనే లక్ష్యంతో పాఠశాల పేరెంట్స్ కమిటీ ఆవరణలో ఆర్గానిక్ కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా పండే కూరగాయాలు, ఆకుకూరలతో విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. జగనన్న గోరుముద్దతో రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. ప్రతి రోజు రాగి జావ అందిస్తున్నారు.



ఆర్గానిక్ కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రోత్సాహం అభినందనీయం



జగనన్న ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నాడునేడు ద్వారా పాఠశాల అభివృద్ధి చెందింది.పేద పిల్లలకు కార్పొరేట్ విద్యాను అదించేందుకు ప్రభుత్వ చేస్తున్న సేవలు మరువలేం.దాతలు కూడా సహకారం అందిస్తున్నారు.

–ఈదా సాంబిరెడ్డి, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్

వచ్చే ఏడాది బస్సు సౌకర్యం



పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం, దాతలు సహకరిస్తే తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలకు పంపి వారి వంతు సహాయం అందిస్తున్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాల నిర్వహణకు ప్రభుత్వం రూ.2 లక్షలు ఇచ్చింది. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు వచ్చే ఏడాది బస్సు సౌకర్యం కల్పిస్తాం.

–గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, 75త్యాళ్ళూరు

భగ్గుమన్న 'కొమ్మాలపాటి' వర్గం



గుంటూరులో ఆందోళన చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్ అనుచరులు



అవమాన భారంతో గుంటూరు నుంచి హైదరాబాద్ పయనమైన శ్రీధర్

- భాష్యం ప్రవీణ్‌కు సీటు కేటాయించడంతో తీవ్ర నిరాశలో కొమ్మాలపాటి శ్రీధర్
- కనీసం పిలిచి మాట్లాడలేదని అనుచరుల వద్ద ఆవేదన
- కొమ్మాలపాటి శ్రీధర్‌ను కలిసేందుకు వెళ్లిన ప్రవీణ్...కొద్దిసేపు ఉద్రిక్తత
- టికెట్ ఇవ్వకముందే ఎందుకు హడావుడి చేశావని ప్రవీణ్‌పై ఆగ్రహం
- పార్టీలోనే ఉంటే సహకరిస్తానని చెప్పి హైదరాబాద్ వెళ్లిన శ్రీధర్
- శ్రీధర్ వర్గంపై బెదిరింపులకు పాల్పడుతున్న ప్రవీణ్ వర్గం

సాక్షి, నరసరావుపేట, పెదకూరపాడు: టీడీపీ రెండో జాబితాలో పెదకూరపాడు స్థానం భాష్యం ప్రవీణ్‌కు కేటాయించడంపై మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ అనుచరులు ఒకసారిగా భగ్గుమన్నారు. టికెట్ కొమ్మాలపాటికే కేటాయిస్తారని ముందుగా గుంటూరులోని నివాసానికి గురువారం ఉదయం ఆయన అనుచరులు భారీగా చేరుకున్నారు. స్వీట్లు, బాణసంచా కూడా సిద్ధం చేసుకున్నారు. మధ్యాహ్నం టీడీపీ టికెట్ భాష్యం ప్రవీణ్‌కు కేటాయిస్తున్నట్లు పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించడంతో ఒకసారిగా కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయులు ఆందోళన చేపట్టారు. ఆయనకే టికెట్ కేటాయించాలని నినాదాలు చేశారు.

భాష్యం ప్రవీణ్‌పై కార్యకర్తల ఆగ్రహం

టీడీపీ టికెట్ ప్రకటించిన కొద్దిసేపటికి భాష్యం ప్రవీణ్ గుంటూరులోని కొమ్మాలపాటి శ్రీధర్ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఆందోళన చేస్తున్న కార్యకర్తలు ఆయన్ను చూసి మండిపడ్డారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అచ్చంపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రవీణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ కేటాయించకముందే నియోజకవర్గంలో ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లతో హడావుడి ఎందుకు చేశారు అని ప్రశ్నించారు? స్థానికేతరుడు అంటూ నినాదాలు చేశారు. దీంతో ఒకసారిగా భాష్యం ప్రవీణ్ టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకెందుకు.. ఏమైనా ఉంటే మేము మేము చూసుకుంటాం..మీరెవ్వరు ? అంటూ గట్టిగా అరవడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఇదే సమయంలో కొమ్మాలపాటి తన అనుచరుల్ని సముదాయించారు.

కనీస గౌరవం దక్కలేదు

టికెట్ దక్కకపోవడంపై కొమ్మాలపాటి శ్రీధర్ ముఖ్య అనుచరుల వద్ద జరిగిన అన్యాయంపై వాపోయారట. వరుసగా నాలుగు పర్యాయాలు పెదకూరపాడులో టీడీపీ ఓడిపోతూ అభ్యర్థులు కరువైన సమయంలో 2009లో పోటీ చేసి గెలిచానని, పార్టీ కోసం 18 సంవత్సరాలు కష్టపడితే ఇదేనా దక్కిన గౌరవం అంటూ ఆవేదన చెందారట. పార్టీ కోసం ఎంతో డబ్బు ఖర్చు చేసినా చంద్రబాబు కనీసం పిలిచి మాట్లాడకపోవడం అన్యాయమన్నారట. నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపి శ్రీధర్ హైదరాబాద్ వెళ్లిపోయారు.

పార్టీలో ఉంటే సహకరిస్తా !

కొమ్మాలపాటి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన భాష్యం ప్రవీణ్ రాబోయే ఎన్నికల్లో సహకరించాలని కోరారట. దీనికి స్పందనగా శ్రీధర్ మాట్లాడుతూ.. పార్టీలోనే ఉంటే కచ్చితంగా సహకరిస్తానని, ఏమి జరుగుతుందో కాలమే నిర్ణయిస్తుందటూ సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో అవాక్కైన ప్రవీణ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బెదిరింపులకు తెరలేపిన ప్రవీణ్ వర్గీయులు

ధరణికోటకు చెందిన వద్దినేని సంజయ్ ఇటీవల కొమ్మాలపాటికే టికెట్ అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. గురువారం అధిష్టానం ప్రవీణ్‌కు సీటు కేటాయించడంతో ఆయన వర్గానికి చెందిన అచ్చంపేట మండలం వేల్పూరుకు వాసి వంకాలపాటి భాస్కర్ సంజయ్‌కు ఫోను చేసి బెదిరించిన ఆడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పెదకూరపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెల్లలచెరువు సురేష్ ఇటీవల భాష్యం ప్రవీణ్‌కు కలవడంతో శ్రీధర్ వర్గీయులు ఆయనపై అసహనం వ్యక్తం చేశారు. టికెట్ ప్రకటించన నేపథ్యంలో .. ఇప్పుడేమంటారని సోషల్ మీడియాలో సురేష్ వీడియో పెట్టారు. ఇలా నియోజకవర్గంలో టీడీపీ రెండు వర్గాలుగా చీలి ఘర్షణ పడుతున్నారు.

పేదల సొంతింటి కల సాకారమే సీఎం జగన్ లక్ష్యం

- లే ఔట్లలో సమస్యలుంటే పరిష్కరిస్తాం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పట్టణంలో లబ్ధిదారులకు 544 పట్టాల పంపిణీ



ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: రాష్ట్రంలో పేదల అభ్యున్నతి, వారి సొంతింటి కల సాకారానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేశారని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద 11,12,13 వార్డులకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కోర్టు వివాదంతో నిలిచిపోయిన వారితో పాటు ఈ మధ్య నూతనంగా దరఖాస్తు చేసుకున్న 159 మందికి ఇళ్ల పట్టాల్ని మంజూరు చేస్తున్నామని తెలిపారు. మూడు వార్డుల్లో కలిపి 385 మందితో పాటు, మొత్తం 544 మందికి అందిస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వాన్ని మళ్లీ నిలబెడితే ఇల్లు కట్టించి ఇస్తామని తెలిపారు.

తేలని పేట పంచాయితీ

- రెండో జాబితాలోనూ నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిని ప్రకటించని టీడీపీ
- టికెట్ రాదేమోనన్న ఆందోళనలో బీసీ నేత చదలవాడ అరవింద్‌బాబు
- లావు శ్రీకృష్ణ దేవరాయల వల్లే అంటూ ఆక్రోశం
- గురజాల సీటు యరపతినేనికి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న అసమ్మతి వర్గం
- టికెట్ రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో జంగా కృష్ణమూర్తి

సాక్షి, నరసరావుపేట: టీడీపీ రెండు జాబితాలలో పల్నాడులోని ఆరు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. అయితే, ఒక్క నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిత్వంపై మాత్రం పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేకపోతోంది. దీంతో ఈ నియోజకవర్గ టీడీపీ నేతల్లో గుబులు రేకెత్తుతోంది. సరైన అభ్యర్థి దొరక్క అధిష్టానం ఆందోళనలో ఉంటే.. టికెట్ దక్కుతుందో లేదోనన్న భయం ఆశావహుల్లో నెలకొంది. తనకు టికెట్ ఇవ్వరేమోనన్న ఆందోళనలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చదలవాడ అరవింద్ బాబు ఉన్నారు. గత ఎన్నికలో ఓడిపోయినా ఏమాత్రం ఖర్చుకు వెనుకాడకుండా పనిచేశానని, అయినా తన పేరు జాబితాలో లేకపోవడంపై విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా తనను తప్పించాలని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నిస్తున్నారని అనుచరులతో చదలవాడ వాపోతున్నారట. వైఎస్సార్ సీపీలో బీసీ నేతకు టికెట్ ఇస్తామనడంతో పార్టీ మారిన లావు టీడీపీలో ఉన్న ఏకైక బీసీ అభ్యర్థినైన తనకు సైతం టికెట్ దక్కకుండా చూస్తున్నారని మథనపడుతున్నారట. చదలవాడకు అన్యాయం చేస్తే సహించేది లేదని ఆయన వర్గం బాహటంగానే హెచ్చరిస్తోంది. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు సహకరించేది లేదని తెగేసిచెబుతున్నారు. మరోవైపు ఈ సీటులో బీజేపీ పోటీ చేస్తుందన్న ప్రచారం గురువారం నుంచి నియోజకవర్గంలో ఊపందుకుంది.

యరపతినేనికి టికెట్

తొలి జాబితాలో చోటు దక్కని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు గురువారం విడులైన లిస్టులో పేరు ఉండటంతో ఆయన ఊపిరి పీల్చుకున్నారు. తొలి జాబితాలో పేరు ఇవ్వకుండా చంద్రబాబు అవమానించారంటూ రగిలిపోతున్న విషయం తెలిసిందే. మరోవైపు యరపతినేనికి అభ్యర్థిత్వంపై ఆయన వ్యతిరేక వర్గం మండిపడుతున్నారు. ఎంత చెప్పినా అదిష్టానం తమ మొరను ఆలకించడకుండా మరోసారి టికెట్ ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ముందుగా చెప్పినట్టే యరపతినేనికి ఎన్నికల్లో సహకరించబోమని చెబుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో రహస్యంగా సమావేశమైన భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుందామని ఓ నిర్ణయానికి వచ్చారట.

జంగా భవితవ్యం ప్రశ్నార్థకం

వైఎస్సార్‌సీపీకి దూరంగా ఉంటున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రాజకీయ భవిష్యత్తు ముగిసినట్టేనా అన్న వాదన జిల్లాలో వినిపిస్తోంది. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలతో పాటు టీడీపీలోకి చేరుతున్నారని, గురజాల నుంచి పోటీ చేస్తున్నారంటూ ప్రచారం జరిగింది. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరిగాయి. అయితే, జంగా టికెట్ విషయంపై చంద్రబాబు ఎటూతేల్చకపోవడంతో సొంత మండలం దాచేపల్లిలో జరిగిన రా..కదిలారా కార్యక్రమంలో టీడీపీ కండువా కప్పుకొనే కార్యక్రమం వాయిదాపడింది. అప్పటి నుంచి టీడీపీలోకి వెళ్లాలా వద్దా ? అనే విషయం తేల్చుకోలేక జంగా సతమతమవుతున్నారట. టీడీపీ రెండు జాబితాల్లో పేరు లేకపోవడం, గురజాల సీటు యరపతినేనికి ఇవ్వడం జంగా వర్గంలో మరింత ఆందోళన నెలకొంది. దీంతో గురువారం మధ్యాహ్నం నరసరావుపేటలోని ఎంపీ లావు కార్యాలయానికి వచ్చి శ్రీకృష్ణదేవరాయలతో మంతనాలు జరిపినట్టు తెలుస్తోంది.

జిల్లాలో 33,368 మందికి ఈబీసీ నేస్తం

- బ్యాంకు ఖాతాలకు రూ.50.05కోట్లు జమ
- లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేసిన కలెక్టర్ శివశంకర్



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో 33,368 మందికి ఈబీసీ నేస్తం ద్వారా రూ. 50,52,0000 మేర బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడో విడత కింద సాయాన్ని విడుదల చేశారు. కార్యక్రమాన్ని స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ శివశంకర్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్రవర్ణ పేద మహిళల జీవితాల్లో కొత్త కాంతుల్ని నింపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తోందని తెలిపారు. సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది సుష్మ పాల్గొన్నారు.

సక్రమంగా వినియోగిస్తే ఓటు వజ్రాయుధం

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



నరసరావుపేట: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని మీడియా పాయింట్‌లో ఓటు హక్కు విలువలు తెలుపుతూ ప్రచురించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బందికి ఓటు హక్కు వినియోగంపై అవగాహన నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు, ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ,, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, అటవీ శాఖ అధికారి ఎన్.రామచంద్ర రావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలో ఒకరు డిబార్

నరసరావుపేట ఈస్ట్: జూనియర్ ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు గురజాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడి డిబార్ అయ్యాడు.చివరి రోజు పరీక్షలకు జిల్లాలో 16,251మంది విద్యార్థులకు గానూ 15,465 మంది విద్యార్థులు హాజరయ్యారు. మరో 780 మంది గైర్హాజరయ్యారు.

సంక్షేమ ప్రదాతగా సీఎం జగన్ నిలిచిపోతారు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మహిళా లబ్ధిదారులతో కలిసి నమూనా చెక్కు ఆవిష్కరిస్తున్న పిన్నెల్లి

మాచర్ల: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల పాటు పేద ప్రజల సంక్షేమం కోసం వివిధ పథకాల పేరిట రూ. 2.79 లక్షల కోట్లు నేరుగా మహిళలు, రైతులు, ప్రజల ఖాతాలలో వేసి పేద ప్రజలను ఆదుకుంటున్న ఘనత దేశ చరిత్రలోనే సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని గుంటూరు రోడ్డులోని మార్కెట్ యార్డులో నియోజక వర్గంలోని మహిళలకు నాల్గవ విడత వైఎస్సార్ చేయూత పథకం కింద మంజూరైన రూ. 28 కోట్ల నమూనా చెక్కును అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఆయా మండలాల ఎంపీపీలు అలుగుమల్లి సంజీవరెడ్డి, బూడిద మంగమ్మ, యేచూరి సునీత, మార్కెట్ యార్డు చైర్మన్‌లు తాడి వెంకటేశ్వరరెడ్డి, కొమ్ము కౌసల్య, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, ఉప్పలపాడు జాని, అంజి, బూదాల మరియమ్మ, జెడ్పీటీసీ సభ్యులు మండ్లి పెద మల్లుస్వామి, శెట్టిపల్లి యలమంద, కేతావత్ రూప్లీ, షేక్ షఫి, బొమ్మిన సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో పేద విద్యార్థులకు ఉజ్వల భవిత

విజయపురిసౌత్: పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యనందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే నని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం విజయపురిసౌత్‌లోని ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో రూ.1.40 కోట్లతో నూతనంగా నిర్మించిన 15 తరగతి గదులతో పాటు రూ.60 లక్షలతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో పేద విద్యార్థులు కళాశాలలోనే చదువుకుంటూనే హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ తదితర ప్రపంచ స్థాయి యూనివర్సిటీలలో రూ.30 వేల నుంచి రూ.60 వేలు విలువ గల ఆన్‌లైన్ కోర్సులను ఉచితంగా చదువుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఈ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని కేంద్ర, రాష్ట్రాలలోని వివిధ శాఖలలో ఉన్నతమైన పదవులలో ఉన్న అధికారులను తయారు చేసిన గొప్ప కళాశాల అని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శెరెడ్డి గోపిరెడ్డి, మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి, మాచర్ల మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీనివాసరావు, తాళ్లపల్లి సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, రిటైర్డ్ డీఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరావు, నాని, లాకా వెంకటరమణ, ఎస్‌కె మస్తాన్, డి సుబ్రహ్మణ్యం, బీర్నీడి రమేష్, సైదులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులపై టీడీపీ వర్గీయుల దాడి అమానుషం

ఘటనకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ చేపడుతున్న అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గిరిధర్

వినుకొండ: దివంగత ముఖ్యమంత్రి, మద్రాస్ మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ సభలో టీడీపీ గూండాలు దాడి చేయడాన్ని నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌లు తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నాయకులతో కలిసి ఘటనకు నిరసనగా పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ సభలో టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు జీ.వీ.ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో దాడులు చేయించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. మరో మారు టీడీపీ అధికారంలోకి వస్తే సామాన్య ప్రజలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న ఆర్యవైశ్యులపై దాడులు చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. రోశయ్య విగ్రహావిష్కరణ సందర్భంగా దాడిలో గాయపడిన పట్టణ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ భర్త రెడ్డి నగేష్‌ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పరామర్శించారు.

వైఎస్సార్ సీపీలోకి జనసేన, టీడీపీ నాయకుల చేరికలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల పరిధిలోని రెంటపాళ్ల గ్రామానికి ఆర్‌ఎంపీ వైద్యుడు, జనసేన ఆవిర్భావం నుంచి పని చేసిన కీలక నాయకుడు మారిశెట్టి రామాంజనేయులు టీడీపీకి చెందిన కొల్లి బ్రహ్మయ్య, మరికొందరు కార్యకర్తలు స్థానిక పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ లో చేరారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు వారిని వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ తమ పార్టీలో ఇతర జెండాలు మోసే పని లేదని ఒకే జెండా, ఒకటే అజెండా అన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. స్థానిక నాయకులతో కలిసి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొమెర శివశంకర్, తదితరులు ఉన్నారు.

గ్రానైట్ క్వారీల్లో తనిఖీల అడ్డగింత

బల్లికురవ: బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో గ్రానైట్ క్వారీల్లో తనిఖీలకు వచ్చిన మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులను రెండో రోజు గురువారం క్వారీ యాజమాన్య అనుచరులు అడ్డుకున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ దిగువ భాగంలో సాయిలక్ష్మీ గ్రానైట్, సంతమాగులూరు మండలంలో లక్ష్మీ ప్రసాద్‌కు రెండు క్వారీలున్నాయి. మైన్స్ అండ్ విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ క్వారీల్లో ఎగుమతులకు సిద్ధంగా ఉన్న రాళ్లను పరిశీలించేందుకు టీంతో వెళ్లారు. అధికారులు ప్రవేశించకుండా ప్రధాన రోడ్డుకు గ్రానైట్ రాళ్లను అడ్డు పెట్టి మూసేశారు. బల్లికురవలో రోడ్డుకు అడ్డుగా ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్, డంపర్లు అడ్డుపెట్టి క్వారీలోకి రాకుండా కర్రలు అడ్డు కట్టారు. చేసిదిలేక వారు వెనుదిరిగారు. తనిఖీలను అడ్డుకున్నారని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏడీ తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: అడిగొప్పల నుంచి మిరియాల మీదుగా జనార్దనపురం వరకు రూ.8 కోట్లతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. మిరియాల గ్రామంలోని ఎర్రవాగు వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీంతో మిరియాల పరిసర గ్రామ ప్రజల చిరకాల కోరిక తీరనుంది.ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ ఈ రోడ్డు మార్గం పూర్తయితే మిరియాల గ్రామస్తులకు రాకపోకలు సులభతరంగా మారుతుందన్నారు. దూరా భారం సైతం తగ్గుతుందన్నారు. మిరియాల గ్రామంలో ఇప్పటికే రూ.1.70 కోట్లతో సీసీ రోడ్లు వేయడం జరిగిందని మరో రూ.1.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. గ్రామ సర్పంచ్ బత్తుల ఏడుకొండలు, ఉప సర్పంచ్ దారెడ్డి ప్రభాకరరెడ్డి, పార్టీ నాయకులు కొమ్మిరెడ్డి ఎర్రగురవారెడ్డి, మాజీ సర్పంచ్ అలవాల స్వామి, మేకల కోటిరెడ్డి, ఊటా రాజశేఖరరెడ్డి, ఎంపీపీ బొమ్మిన సావిత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ షఫీ, పార్టీ నాయకులు అల్లయ్య, అల్లు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దాచేపల్లి : తాగునీటి ఎద్దడితో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్న తమపై ఎల్లో మీడియా అసత్యాలు ప్రచారం చేయటం తగదని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. ఏబీఎన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని దాచేపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య మాట్లాడుతూ నగర పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలు చేస్తుందని మండిపడ్డారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు పని చేయక తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డారని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నాగులేరుకి కుడికాలువ నుంచి నీరు తెప్పించారని ఆయన చెప్పారు. తన సొంత ఖర్చులతో బోరువేసి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తుంటే ఏబీఎన్ ఛానల్ తమపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఇది ఆ ఛానల్ దిగజారుడుతనానికి నిదర్శమని సాంబయ్య మండిపడ్డారు. సమావేశంలో కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, నాయకులు షేక్ ఖాదర్ భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, దేవళ్ల రఘు, కుందురు తిరుపతిరెడ్డి, దాచేపల్లి సైదారావు, మర్రెబొయిన మహేష్, కొలా శ్రీనివాసరెడ్డి, కొమ్ము బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు



కవాతులో పాల్గొన్న డీఎస్పీ గురునాథ్ బాబు సీఐ ప్రభాకర్, ఎస్ఐ సత్యనారాయణ

సత్తెనపల్లి: రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రజలు సహకరించాలని సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథ్ బాబు అన్నారు. పట్టణంలోని 1,2,6 వార్డుల మీదుగా పురవీధుల్లో గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం బలగాలు సబ్ డివిజన్‌కు చేరుకున్నాయన్నారు. సబ్ డివిజన్‌లోని సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసు బందోబస్తు కొనసాగుతుందన్నారు. శాంతి భద్రతలు కాపాడటమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తారన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణ సీఐ పీ. ప్రభాకర్, పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడి పట్టివేత

- ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- విచారణ చేపడుతున్న జీఆర్పీ పోలీసులు

చీరాల: రైళ్లల్లో తిరుగుతూ నిద్రపోతున్న ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులను చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని బోసనగర్‌కు చెందిన ఓ దొంగను చీరాల జీఆర్పీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. విజయవాడ నుంచి తిరుపతి వరకు వెళ్లే రైళ్లల్లో తిరుగుతూ నిద్రపోతున్న ప్రయాణికుల వద్ద ఉండే ల్యాప్‌ట్యాప్‌లు, బంగారం, సెల్‌ఫోన్లు వంటి విలువైన వస్తువులు అపహరించి అందిన కాడికి అమ్మి జల్సాలు చేస్తుంటాడు. ఇతనిపై పలు జీఆర్పీ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. చీరాల జీఆర్పీ పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచి చేపడుతున్న విచారణలో భాగంగా బోసనగర్‌కు చెందిన ఓ దొంగను అదుపులోకి తీసుకుని విచారించగా చీరాల, బాపట్ల, తెనాలి, విజయవాడ, వరంగల్, తిరుపతి స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని సమాచారం. ఇతని వద్ద ల్యాప్‌ట్యాప్‌లు కొనుగోలు చేసిన వ్యక్తుల సమాచారాన్ని పోలీసులు సేకరించి వారిని విచారిస్తున్నారని తెలిసింది.